manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 245 | మంగళవారం | 18.03.2025




# సార్.. సమయం ఇవ్వండి

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

**హైదరాబాద్, మన చౌరాస్తా :** పెద్దన్నను కలిసేందుకు ముప్పై మూడోసారి హస్తినకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి. అఖిలపక్షంతో వస్తున్నాం.. సమయం ఇవ్వాలని ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ సోమవారం లేఖ రాశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర మద్దతు కోరారు. విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులకు ఆమోద ముద్ర పడింది. పార్లమెంట్ ఆమోదం పొందేలా కలిసికట్టుగా కృషి చేసేందుకు అఖిలపక్షాలు సంసిద్ధమయ్యాయి.సభలో చెప్పినట్టుగా రేవంత్ సర్కార్ పార్లమెంట్ లో బీసీ బిల్లుల ఆమోదం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ ప్రతినిధులతో ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించింది.ఈ మేరకు సమయం ఇవ్వాల్సిందిగా ప్రధానికి లేఖ రాశారు సీఎం రేవంత్ రెడ్డి. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులను శాసనసభ ఆమోదించిన విషయాలను ప్రస్తావిస్తూనే సమయం ఇవ్వాలని కోరారు. తెలంగాణలో ఇప్పుడు విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో , షెడ్యూల్ కులాలు 15 శాతం, షెడ్యూల్ తెగలు 7శాతం, మైనార్టీలు 4 శాతం, BCలకు 23 శాతం రిజర్వేషన్లు వున్నాయి. ఐతే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగుణ నివేదిక ప్రకారం బీసీలు 56.36 శాతం. ఆ మేరకు రిజర్వేషన్ల పెంపు ఆవశ్యకతను వివరిస్తూ కేంద్ర మద్దతు కోరనుంది అఖిలపక్షం. అపాయింట్ మెంట్ కోరుతూ పెద్దన్నకు లేఖ వెళ్లింది. ఇక ప్రధాని కార్యాలయం నుంచి పిలుపే తరువాయి అఖిలపక్షం ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలవనుంది.

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు..

సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మరో లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్ పేరును 'పొట్టి శ్రీరాములు చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్' గా మార్చాలని కోరుతూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కు సీఎం లేఖ రాశారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరును పెట్టడంతో పొట్టి శ్రీరాములు పేరును చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.



## అచ్చంపేట ఎమ్మెల్యేకు సీఎం పరామర్శ

ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పరామర్శించారు. బంజారాహిల్స్ లోని స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వంశీకృష్ణని పరామర్శించిన సీఎం వైద్యులను నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పాలకుర్తి విద్యార్థులు 2



ఫొటోగ్రఫీలో వారిది 3

## గొప్ప చరిత్ర

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



విద్యార్థులు ఆందోళనకు 2

## గురికావద్దు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా




మామునూరు ఎయిర్ పోర్ట్‌కు 3

## రుద్రమదేవి పేరు పెట్టాలి

- జాగృతి రాష్ట్ర నాయకురాలు మాధవి

General News



# విద్యార్థులు ఆందోళనకు గురికావద్దు

- పరీక్షలకు బాగా ప్రిపేర్ కావాలి
- టాపర్లకు బహుమతులు అదిస్తాం..
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆందోళనకు గురికావద్దని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచరించారు. సోమవారం ఆయన పదో తరగతి పరీక్షలు రాసే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో జూమ్ మీటింగ్ ద్వారా ముఖాముఖీ నిర్వహించారు. ఈ నెల 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరిగే పదో తరగతి పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ ఏ అంశాలలో విద్యార్థులను సన్నద్ధం చేయాలో కలెక్టర్ వివరించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ప్రతి విద్యార్థి హాజరయ్యేలాగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షలు అంటే భయం లేకుండా విద్యార్థులు అన్ని పరీక్షలను రాసే విధంగా చూసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యం పైన కూడా తగిన శ్రద్ధ వహించాలన్నారు. తగినంత వ్యాయామం, మంచి పోషకాహారం, నిద్ర కూడా తగినంత ఉండే విధంగా జాగ్రత్త పడాలని సూచించారు. పరీక్షలకు వెళ్లబోయే చివరి వారం రోజుల్లో కొత్త విషయాలు చదవకుండా.. చదివిన విషయాలని మళ్లీ మళ్లీ పునఃశ్చరణ చేసుకోవాలన్నారు. ప్రతీ మండలం నుంచి టాప్ స్కోర్ సాధించిన విద్యార్థికి అలాగే జిల్లా టాపర్ కు సైకిల్‌ను బహుమానంగా ఇస్తామన్నారు. అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రివార్డులు, బహుమానాలు ఉంటాయని తెలియజేశారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు కూడా ప్రత్యేక అవార్డులు ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీఈఓ రమేష్, ఏసీజీ రవికుమార్, జీసీడీవో గౌసియా బేగం పాల్గొన్నారు.



## పరీక్షల కేంద్రాల పరిశీలన

జనగామ, మన చౌరాస్తా : జనగామ పట్టణంలోని ధర్మకంచ ప్రభుత్వ కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీయట్ పరీక్షలను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, మెడికల్ సిబ్బంది, మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. సరిపడా ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్ లను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలను నిర్వహించాలని, పరీక్ష పూర్తైన వెంటనే జవాబు పత్రాలను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

**తరిగొప్పుల, మన చౌరాస్తా :** తరిగొప్పుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయులు బానోతు రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిగా మడికొండ వంశీకృష్ణ, మండల విద్యాశాఖాధికారిగా నేనావత్ ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా నేలకంటి కీర్తన, ఫిజికల్ డైరెక్టర్లుగా భూక్యా కర్ణాకర్, గంజి రాజశేఖర్ వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎం రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారివారి బాధ్యతలను చాలా చక్కగా నిర్వర్తించారని విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో విద్యార్థులందరూ పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాలెపు విజయ, గాదె జోసెఫ్ బేబి, మహమ్మద్ యూసుఫ్ పాషా, తాటిపెల్లి పద్మ, ఆవుల అమర్నాథ్, గూడ నాగరాణి, నాగవెల్లి అనిత, అజహర్ సుల్తానా, తెజావత్ శ్రీనివాస్, పుప్పాల సుమలత, రవి, పాకాల కుమారస్వామి, గోపగోని సంధ్య తదితరులు పాల్గొన్నారు.



# జనగామ ఎంఈఓ గా శంకర్ రెడ్డి



**జనగామ టౌన్, మన చౌరాస్తా :** జనగామ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)గా గురిజాల శంకర్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ గర్ల్స్ స్కూల్‌లో గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ఎంఈవో బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (హైదరాబాద్) ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జనగామ ఎంఈఓగా బాధ్యతలు నిర్వర్తించిన రాజేందర్ ఇటీవల పదవి విరమణ పొందారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శంకర్ రెడ్డికి పరువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



# కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి మాజీ మంత్రి తనయుడి సాయం

**చేర్యాల, మన చౌరాస్తా :** మాజీ మంత్రి నిమ్మ రాజిరెడ్డి తనయుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి ఓ నిరుపేద కుటుంబానికి చేయూతను అందించాడు. చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుస్క కృష్ణ తల్లి నర్సవ్వ ప్రమాదవశాత్తు కిందపడి తొంటి ఎముక విరిగి గత కొంతకాలంగా ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి తనయుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, మనవడు నిఖిల్ రెడ్డి, కోడలు నిమ్మ అనిత సోమవారం ఆమెను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత గుస్క కృష్ణకు ఆర్థిక సహాయం అందజేశారు.





# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పాలకుర్తి విద్యార్థులు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 13న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాలకుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో గుంజే శ్రీవల్లి, 400 మీటర్ల రన్నింగ్‌లో లకావత్ నిఖిల్ విజేతలుగా నిలిచారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఆయా విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మామిండ్ల సొమ్మల్లు, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి సోమవారం తెలిపారు. అథ్లెటిక్స్ పోటీల్లో గెలిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్, గుగులోతు బలరాం, అశోక్ కుమార్, మరియా జత్సృత, రవి నరసింహమూర్తి మాలతి, గ్రామస్తులు అభినందించారు.

# ఫొటోగ్రఫీలో వారిది ఎంతో గొప్ప చరిత్ర

## ■ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉందని, ఆ రోజుల్లో దేశంలో ప్రప్రథమంగా ప్రైవేట్ ఫొటో కెమెరాలు కొనుగోలు చేసిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం బషీర్ బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అనుబంధ సంఘమైన తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్టులకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వెయ్యి మాటల కన్నా ఒక్క ఫొటో ఎంతో గొప్పదన్నారు. పత్రికల్లో ఎన్నో వార్తలు ప్రచురితమైనా పాఠకుల దృష్టిని ఆకర్షించేది ఫొటోలు మాత్రమేనని జిష్ణు దేవ్ వర్మ స్పష్టం చేశారు. చరిత్రలో రికార్డుగా ఉండి పోయేది ఫొటోలే అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో పత్రికలకు ఆదరణ తగ్గి పోతుందని చర్చ జరుగుతుందని, కానీ ఇది తాత్కాలికం మాత్రమేనని, భవిష్యత్తు పత్రికలకే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, రాష్ట్ర టూరిజం అభివృద్ధి



సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కె.ఎన్.హరి పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో జనగామ జిల్లాకు చెందిన ఫొటో




గ్రాఫర్లు గోవర్ధనం వేణుగోపాల్ (సాక్షి), రచ్చ మోహన్ (ఈనాడు) రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్లుగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ఫొటోగ్రాఫర్లుగా అవార్డు అందుకున్న వారిని జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు అభినందించారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఔదార్యం

**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట్ట మండలంలోని హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువ చేసే క్రీడా పరికరాలను వైటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఆసియా సంస్థ యువ ఇంజనీర్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సామల కమల విచ్చేసి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తూ వారికి క్రీడా పరికరాలను అందజేసిన వైటెక్ సిస్టం ఆసియా సంస్థ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో ఎంతో నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులకు తోడ్పాటునందించుటకు దాతలు సహకరించడం ఎంతో సంతోషకరమన్నారు. ఇతరులకు సేవ చేయాలనే దృఢ సంకల్పం ఉన్న వారికి సమాజంలో మంచి పేరు ఉంటుందని కొనియాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడ వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి జొన్నాల శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యాయులు గుర్రాల కరుణాకర్ రెడ్డి, సిఆర్పీ రవిందర్ లాల్, అంగన్‌వాడీ టీచర్స్ మమత, స్వప్న అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ వి.ఆశలత, సభ్యులు ఇట్టబోయిన రాజు, మూల కిరణ్ గౌడ్, నాగరాజు, కవిత, అంజనేయులు, రాములు, సాయిబాబా, శేఖర్, ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.





# ఎయిర్‌పోర్ట్‌కు రాణి రుద్రమ పేరు పెట్టాలి

**హనుకొండ, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లాకు మంజూరైన ఎయిర్ పోర్ట్‌కు విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి విమానాశ్రయంగా నామకరణం చేయాలని జాగృతి రాష్ట్ర నాయకురాలు మారిపెల్లి మాధవి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రామాణికం ఓరుగల్లు కోటను నిర్మించి ప్రపంచ ఖ్యాతికి ఎక్కించింది కాకతీయ రాజులన్నారు. కాకతీయ సామ్రాజ్య రాణి రుద్రమదేవి మహిళా సామ్రాజ్యానికి ఆదర్శ వనిత అన్నారు. అందుకే వరంగల్ జిల్లాకు మంజూరైన విమానాశ్రయానికి ఆమె పేరు పెట్టాలని కోరారు. జాగృతి సంస్థ తరఫున వ్యవస్థాపక అధ్యక్షురాలు,




ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు తాము డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆ పేరును నామకరణం చేయాలని, ఇందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. కార్యక్రమంలో జాగృతి వరంగల్ జిల్లా నాయకురాలు నూకల రాణి మంజుల, నాయకురాలు కేతిరి సమ్మక్క, గుములపురం హైమావతి, నేరెళ్ల సరోజన కన్నం వీనమాల, రాహుల్ పాల్గొన్నారు.



# పందిరి స్తంభం స్థాపన

**జనగామ, మన చౌరాస్తా :** శ్రీరామ ఉత్సవల ఏర్పాటు కోసం సోమవారం పట్టణ పురోహితులు అప్పయ్య శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి పూజ నిర్వహించి తదుపరి పందిరి స్తంభం స్థాపన (గుంజ నాటడం) చేశారు. కార్యక్రమంలో పజ్జూరి గోపయ్య మహంకాళి హరిశ్చంద్ర గుప్త, పోకల లింగయ్య, పజ్జూరి జయహరి, ఐత శ్రీకాంత్, పోకల వేణు, నందు బజాజ్, సోమ హనుమంతరావు, బచ్చు అశోక్, బుస్స పాండు, కందుకూరు శ్రీనివాస్, గోవిందులోయ, ఆర్గుల శ్రీనివాస్, ద్వారకదాసు బజాజ్, అయిత శ్రీనివాస్, బచ్చు రమేష్, పెద్ది శంకర్ తదురులు పాల్గొన్నారు.

# అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ రోడ్డు మీద అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహ దీక్షలు సోమవారం నాటికి 52వ రోజుకు చేరుకున్నారు. మహిళా సంఘం పట్టణ నాయకురాలు మచ్చ యాదలక్ష్మి దండ వేసి నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజల కష్టాలను తీర్చాలని అన్నారు. 52 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ఎంపీ, అధికారులు స్పందించి అండర్ పాస్ బ్రిడ్జి తక్షణమే ఇవ్వాలి, ఈ న్యాయమైన దీక్షలకు జనగామ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అండగా ఉంటుందని అన్నారు. ఇక్కడున్న మహిళలందరినీ ప్రజలను చైతన్యం చేసి జిల్లా వ్యాప్తంగా పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బూడిది ప్రశాంత్, బిచ్చల లక్ష్మి, బొల్లం సారమ్మ, గజ్వేల్లి మానస, గాదే లక్ష్మి, తాళ్లపల్లి పోషల్ల, కర్ణ కంటి పావని, ఆదిమూలం విజయ, మల్లం నరసమ్మ పాల్గొన్నారు.



## సొగసరి

# మీనాక్షి..

మీనాక్షి చౌదరి.. ఒక కథానాయకి, మోడల్, అందాల పోటీ టైటిల్ హోల్డర్. ఆమె తెలుగు తమిళ చిత్రాలలో పని చేస్తుంది. ఆమె ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది.  అక్కడ ఆమె ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018గా కిరీటాన్ని పొందింది. చౌదరి మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి 1వ రన్నరప్‌గా నిలిచింది. 1 ఫిబ్రవరి 1997 సంవత్సరంలో హర్యానాలోని పంచకులలో పుట్టి పెరిగింది అందాల భామ మీనాక్షి చౌదరి. ఈ ముద్దుగుమ్మ తండ్రి బీఆర్ చౌదరి భారత ఆర్మీ సైన్యంలో కల్నల్ గా పని చేసారు. 2018 జనవరిలో అయన మరణించారు. చండీగఢ్‌లోని సెయింట్ సోల్జర్ ఇంటర్నేషనల్ కాన్వెంట్ స్కూల్ నుంచి పాఠశాల విద్యను పూర్తి చేసింది ఈ వయ్యారి. పంజాబ్‌లోని డేరా బస్సీలోని నేషనల్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ లో డెంటల్ సర్జరీలో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేసింది.చదువుకున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి స్విమ్మర్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా విజయాన్ని అందుకుంది ఈ బ్యూటీ. ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 గా కిరీటాన్ని పొందింది. 2021లో ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే తెలుగు చిత్రంతో కథానాయకిగా పరిచయం అయింది. 2022లో రవితేజకి జోడిగా నటించిన ఖిలాడీ డిజాస్టర్ కాగా అడివి శేష్ సరసన కనిపించిన హిట్ 2 బ్లాక్ బస్టర్ అయింది. 2023లో కొలై అనే ఓ తమిళ్ సినిమా మాత్రమే చేసింది. 2024లో మహేష్ సరసన గుంటూరు కారంతో మొదలుపెట్టి లక్కీ బాస్కర్, మట్కా, మెకానిక్ రాకీ చిత్రాల్లో నటించింది. అయితే వీటిలో లక్కీ బాస్కర్ బ్లాక్ బస్టర్ అయింది. 2025లో సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది ఈ బ్యూటీ.